క్లుప్తంగా

గ్రామస్తులకు తాగునీటి సరఫరా



గోపవరంలో ట్యాంకరు ద్వారా తాగునీటిని సరఫరాను పరిశీలిస్తున్న సర్పంచ్ కుంచే బుల్లియ్య

ఉప్పలగుప్తం: గోపవరం పంచాయతీ పరిధి తిరుమలచెరువు ప్రాంతంలో వారం రోజుల నుంచి మంచి నీటి సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతున్న కారణంగా సర్పంచ్ కుంచే బుల్లియ్య ఆధ్వర్యంలో ట్యాంకర్ ద్వారా మంగళవారం తాగునీటిని సరఫరా చేశారు. గ్రామంలో ఉన్న 40 వేల కిలో లీటర్ల ఓహెచ్ఎస్ఆర్‌కు కొన్ని ఇబ్బందుల కారణంగా నీటి సరఫరా అందకపోవడంతో గ్రామస్తులు సమస్యను తమ దృష్టికి తీసుకురావడంతో తాత్కాలికంగా పరిష్కారం చూపామని సర్పంచ్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కొంకి ఏడుకొండలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా పాదాలమ్మ తీర్థం

తాళ్లరేవు: జి.వేమవరం గ్రామ దేవత పాదాలమ్మవారి జాతర ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రెండు రోజులుగా వైభవంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి అమ్మవారి జాతరను గరగ నృత్యాలు, డప్పుల వాయిద్యాలతో నిర్వహించారు. సోమవారం అమ్మవారి తీర్థం సందర్భంగా పాదాలమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేసారు. సర్పంచ్ పుణ్యమంతుల సూరిబాబు, సత్తిబాబు, భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి మొక్కులు చెల్లించారు.

27 నుంచి యోగా తరగతులు

ఐ పోలవరం: యోగాంధ్ర –2025 కార్యక్రమంలో భాగంగా కలెక్టర్, దేవదాయశాఖ ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ఈనెల 27 నుంచి జూన్ 21 వరకు మండల పరిధిలో మురమళ్లలో వీరేశ్వరస్వామి ఆలయంలో యోగా శిక్షణ ఉచిత తరగతులు నిర్వహిస్తున్నట్లు సోమవారం సహాయ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా నెలరోజుల పాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో సిబ్బంది, అర్చకులు, వేద పండితులు, భక్తులు, సేవా సంస్థ సేవకులు పాల్గొనాలని కోరారు.

ఏరియా ఆస్పత్రిలో మాస్కుల పంపిణీ

అమలాపురం టౌన్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోని రోగులకు, వారికి సహాయకులుగా వచ్చిన వారికి సామాజిక కార్యకర్త, గణేష్ వర్తక సంఘం అధ్యక్షుడు వలవల శివరావు మాస్కులను సోమవారం పంపిణీ చేశారు. మళ్లీ కరోనా భయం వెంటాడుతున్న క్రమంలో ముందు జాగ్రత్తగా మాస్కులు పంపిణీ చేసినట్లు శివరావు తెలిపారు. మాస్కులను రోగులు, వారి వెంట వచ్చిన సహాయకులకే కాకుండా ఆస్పత్రి సిబ్బంది, వైద్యులకు కూడా పంపిణీ చేశారు. దాదాపు 500 మాస్కులు ఆయన అందజేశారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమ్మె విరమణ

అమలాపురం రూరల్: కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యల పరిష్కారం కోరుతూ 27 రోజులుగా అమలాపురం కలెక్టరేట్ వద్ద కొనసాగిస్తున్న సమ్మెను సోమవారం విరమించారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మె విషయంలో వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ హామీ మేరకు సమ్మె విరమిస్తున్నట్లు అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షురాలు పి.మమతాజ్యోతి, జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు ఎ.సాయిశంకర్ తెలిపారు. సమ్మె కాలంలో తమకు సహకరించిన కలెక్టర్ మహేష్ కుమార్, వైద్య ఆరోగ్య శాఖ అధికారి దుర్గరావు దొర, ఎస్పీ కృష్ణారావు, మెడికల్ ఆఫీసర్లను వారు కలసి ధన్యవాదాలు తెలిపారు.

డిప్యూటీ తహసీల్దార్ పోస్టులకు ఆహ్వానం

యానాం: పుదుచ్చేరి, మాహే, కారైకల్, యానాం రీజియన్లలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ రెవెన్యూ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌లో ఖాళీగా ఉన్న 30 డిప్యూటీ తహసీల్దార్ (డీటీ) గ్రూప్–బి, నాన్ గెజిటెడ్, నాన్ మినిస్టీరియల్ పోస్టులను రాత పరీక్ష ద్వారా భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్లు ఆ శాఖ ప్రత్యేక కార్యదర్శి, కలెక్టర్ కులోత్తుంగన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోస్టులకు సంబంధించి కేటగిరి వారీగా ఖాళీలు, రిజర్వేషన్లు, విద్యార్హతలు తదితర వివరాలను డీఆర్ అండ్ ఏఆర్ రిక్రూట్‌మెంట్ పోర్టల్ రిక్రూట్‌మెంట్.పీవై.జీఓవీ.ఇన్‌లో ఈనెల 28 నుంచి పొందుపరుస్తున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తులకు ఆఖరు తేదీ జూన్ 27 లోగా నిర్ణయించినట్లు తెలిపారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

ముమ్మిడివరం: నియోజకవర్గంలో ఈ నెల 31న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటించనున్న నేపథ్యంలో ఆయా ఏర్పాట్లను కలెక్టర్ మహేష్‌కుమార్ అధికారుల బృందం సోమవారం పరిశీలించారు. స్థానిక మండల పరిధిలోని సీహెచ్ గున్నేపల్లిలో హెలీప్యాడ్ స్థలాన్ని తొలుత పరిశీలించారు. అనంతరం కాట్రేనికోన మండలం చెయ్యేరులో జిల్లాస్థాయిలో ప్రారంభించే పీ4 కార్యక్రమ సభ, బహిరంగ వేదిక ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శాంతలక్ష్మి, ఎస్పీ బి.కృష్ణారావు, డ్వామా పథక సంచాలకులు ఎస్.మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యలతో ఇబ్బందులు

ఇరుకు మార్గాల్లో ఆటోలను నియంత్రించాలని వినతి



ఈదరపల్లిలో కాలిబాల వంతెనపై ఆటోలు రాకతో ట్రాఫిక్ స్తంభించి ఇబ్బంది పడుతున్న ద్విచక్ర వాహన చోదకులు

అమలాపురం టౌన్: ఈదరపల్లి కొత్త వంతెన నిర్మాణం, పాత వంతెనపై ట్రాఫిక్ నిలిపివేతతో పట్టణంలో రోజూ ఎటు చూసినా ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. డాబా గార్డెన్ రోడ్డు, ఈదరపల్లి కాలబాట వంతెన, బైపాస్ రోడ్డు వంతెన నుంచి వెళ్లే మట్టి రోడ్డు, ఇరుకు సీసీ రోడ్డు, నడిపూడి రోడ్డు, సావరం రోడ్డు ఇలా పలు చోట్ల తరుచూ ట్రాఫిక్ సమస్య అనివార్యమవుతోంది. డాబా గార్డెన్ రోడ్డులో మాత్రమే ఆటోలు, కార్లు వెళ్లాలని పోలీసులు ట్రాఫిక్ ఆంక్షల సమయంలో చెప్పినా పట్టణంలోకి వెళ్లి వచ్చే ప్రజలు అన్వేషించుకున్న ప్రత్యామ్నాయ మార్గాల్లోకి కూడా ద్విచక్ర వాహనాలతో పాటు ఆటోలు వచ్చేయడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ద్విచక్ర వాహనాలు మాత్రమే వెళ్లే ఇరుకు మార్గాల్లోకి ఆటోలు కూడా వచ్చేయడంతో ట్రాఫిక్ స్తంభిస్తోంది.

ట్రాఫిక్ నియంత్రణపై ప్రణాళిక లోపం

ఉదాహరణకు ఈదరపల్లిలో పంట కాలువపై ఉన్న కాలిబాట వంతెన నుంచి ఈదరపల్లి మెయిన్ రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్దకు దగ్గరి మార్గాన్ని ఎంచుకున్న ద్విచక్ర వాహన చోదకులకు ప్రయాణం సాగిస్తుంటే అదే మార్గంలో ఆటోలు కూడా రావడంతో అందరూ ట్రాఫిక్ చిక్కులో ఇరుక్కుపోతున్నారు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఈ మార్గంలో ఆటోలు అధికంగా రావడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తి ద్విచక్ర వాహనాలు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది. ట్రాఫిక్ స్తంభించడంతో ద్విచక్ర వాహన చోదకులు అసహనం వ్యక్తం చేస్తూ ఈ ఇరుకు రూట్లోకి ఆటోలు రాకుండా అడ్డుకోవాలని కోరారు. పోలీసులు ట్రాఫిక్ నియంత్రణపై ఓ ప్రణాళిక లేకుండా అమలు చేయక పోవడం వల్లే ఈ దుస్థితి ఎదురవుతోందని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇటు ఈదరపల్లి కాల బాట వంతెన వద్ద, అటు ఈదరపల్లి మెయిన్‌రోడ్డు అంబేడ్కర్ విగ్రహం వద్ద కానిస్టేబుళ్లు ఉండి ఆ ప్రత్యామ్నాయ మార్గంలోకి ఆటోలు వెళ్లకుండా నియంత్రిస్తే తప్ప ద్విచక్ర వాహనాలు సజావుగా సాగవని ప్రయాణికులు అంటున్నారు.

ముస్లిపల్ చైర్‌పర్సన్‌కు పరామర్శ



మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణిని పరామర్శిస్తున్న జగ్గిరెడ్డి, విజయలక్ష్మి

అమలాపురం టౌన్: మాతృ వియోగంతో బాధపడుతున్న అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణిని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి సోమవారం పరామర్శించారు. స్థానిక నారాయణపేటలోని చైర్‌పర్సన్ తల్లి దివంగత శ్రీరామ రాఘవమ్మ స్వగృహానికి వెళ్లి ఆమెకు సానుభూతి తెలిపారు. దివంగత శ్రీరామ రాఘవమ్మ చిత్రపటానికి జగ్గిరెడ్డి, విజయలక్ష్మి, జిల్లా పార్టీ నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. పి.గన్నవరం నియోజకవర్గం పార్టీ కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, అముడా మాజీ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్, పార్టీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు మిండగుదుటి శిరీష్, పార్టీ నాయకులు చిక్కాల రవిశంకర్, దొంగ చిన్నా, గున్నేపల్లి భీమశంకరం తదితరులు మున్సిపల్ చైర్‌పర్సన్ నాగేంద్రమణిని పరామర్శించారు. మున్సిపల్ డీఈఈ సీహెచ్ నాగసతీష్, ఏఈలు సూర్య భాస్కరరావు, వెంకటేష్ కూడా చైర్‌పర్సన్‌ను పరామర్శించి సానుభూతి తెలిపారు.

రేపు యానాంలో జాబ్‌మేళా

యానాం: ఐటీఐలో వివిధ ట్రేడుల్లో సాంకేతిక శిక్షణ పొందిన అభ్యర్థులకు ఈనెల 28న యానాం ప్రభుత్వ ఐటీఐలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు సోమవారం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చింతపల్లి కృష్ణసుధాకర్ తెలిపారు. తమిళనాడు కాంచీపురంలోని ఎల్అండ్‌టీ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ జాబ్‌మేళాలో ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, వెల్డర్, మెకానిక్ మోటార్ ట్రేడుల అభ్యర్థులు ఆరోజు ఉదయం 10 గంటలకు యానాం నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐలో నిర్వహించనున్న ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. యానాం రీజియన్‌కు చెందిన ఐటీఐ ఆఖరి సంవత్సర విద్యార్థులు, శిక్షణ పూర్తిచేసుకున్న నిరుద్యోగులైన యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9849010936 నంబరుకు ఫోన్ చేయాలని కోరారు.

50 శాతం ఎంబీబీఎస్ సీట్ల కోసం చర్యలు

యానాం: పుదుచ్చేరిలో ఉన్న ప్రైవేట్ మెడికల్ కాలేజీల నుంచి ప్రభుత్వ కోటా కోసం 325 ఎంబీబీఎస్ సీట్లను పొందేలా చర్యలు ప్రారంభించాలని సోమవారం ఏఐఏడీఎంకే రాష్ట్ర కార్యదర్శి అన్బళగన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఆయన మాట్లాడుతూ వైద్య విద్యార్థుల ప్రయోజనం కోసం మూడు ప్రైవేట్ మెడికల్ కళాశాలల్లో ఉన్న 650 సీట్లలో 50 శాతం సీట్లను పొందేలా లెఫ్టినెంట్ గవర్నర్, సీఎం సంయుక్తంగా కృషి చేయాలని కోరుతూ తమ పార్టీ తీర్మానాన్ని ఆమోదించినట్లు తెలిపారు.

ఆయుష్ ఆసుపత్రికి 20 పోస్టుల కేటాయింపు

యానాం: స్థానిక గోపాల్‌నగర్‌లో పుదుచ్చేరి ఆయుష్ సొసైటీ ఆధ్వర్యంలో నేషనల్ ఆయుష్ మిషన్(నామ్) ఆయుష్ మంత్రిత్వ శాఖ ద్వారా నిర్మించిన 50 పడకల ఆయుష్ ఆసుపత్రిలో వివిధ విభాగాల్లో సేవలకు 20 పోస్టులను కేటాయించారు. ఈ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సోమవారం ఆయుష్ సొసైటీ డైరెక్టర్ డాక్టర్ ఆర్ శ్రీధరన్ తెలిపారు. పుదుచ్చేరి వెలియనూర్ ఆయుష్ ఆసుపత్రికి మరో 20 పోస్టులు మొత్తం 40 పోస్టులను భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ పోస్టులకు పుదుచ్చేరి నివాసితులు అర్హులని కాంట్రాక్టు పద్ధతిన మెరిట్ ఆధారంగా నియామకం ఉంటుందని, అర్హులైన వారు 'హెల్త్.పీవై.జీఓవీ.ఇన్' వెబ్‌సైట్‌లో ఈనెల 29 నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని, దానికి కావాల్సిన పత్రాలను జతచేసి జూన్ 6లోగా నకలు దరఖాస్తు కాపీతో డైరెక్టరేట్ ఆఫ్ ఆయుష్, నం.29, రూదిలా కాంపెజిన్, పుదుచ్చేరి–605001కు పంపాలని కోరారు.

సముద్ర నాచు సాగు విధానాలపై శిక్షణ



సముద్ర నాచు సాగుపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త సతీష్

అమలాపురం రూరల్: సముద్ర తీరంలో ప్రత్యేకంగా సాగు చేయుచున్న సముద్ర నాచు (సీ వీడ్) సాగు విధి విధానాలపై ఔత్సాహికులకు నెల్లూరు జిల్లా కందుకూరు రెవెన్యూ డివిజన్ గుడ్లూరు మండలం, కర్లపాలెం గ్రామం రామయ్య పట్నం పోర్ట్ సమీప ప్రాంతంలో స్కంద మెరైన్ ఆల్గే సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఎస్ఐఆర్, సీఎస్ఐఆర్ శాస్త్రవేత్త డాక్టర్.ఎల్. సతీష్ పర్యవేక్షణలో శిక్షణ ఇచ్చారు. మొదటిరోజు శిక్షణ తరగతులలో క్షేత్ర సందర్శన ఆచరణాత్మక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కోనసీమ నుంచి వచ్చిన మత్స్యకారులకు అధికారులకు సముద్రపు నాచు మొక్కల పెంపకం, వాటి ప్రాముఖ్యతను వివరించారు. ప్రస్తుతం మార్కెట్లో సీ వీడ్‌కు ఉన్న మార్కెట్ తదితర అంశాలను డాక్టర్ సతీష్ వివరించారు. స్కందామెరైన్ ఆల్గే సొల్యూషన్స్ సంస్థ సభ్యులు ప్రస్తుతం ఈ ప్రాంతంలో సీ వీడ్ సాగు చేసే విధానాన్ని తెలిపారు. ఎల్.సతీష్ మాట్లాడుతూ తీర ప్రాంతం సముద్ర మొక్కల పెంపకానికి అనువుగా ఉంటుందని, ఆరు నెలలు పరిశీలన అనంతరం గుర్తించామని, సాంకేతిక సలహాలు, సూచనలతో ఈ సాగును ఇక్కడ ప్రారంభించనున్నట్లు తెలిపారు. మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు పీవీ శ్రీనివాసరావుతో పాటు మత్స్యశాఖ అధికారులు, సాగర్ మిత్రలు, మత్స్యకారులు, మహిళలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా మత్స్య శాఖ సంయుక్త సంచాలకులు నాగేశ్వరావు, మత్స్యశాఖ సహాయ సంచాలకులు శ్రీనివాసులు, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి లక్ష్మణ్ నాయక్ సాగర్ మిత్రులు, సర్పంచ్, మత్స్య సహకార సంఘ అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

అంతర్వేది ఆలయంలో యోగా కార్యక్రమాల ఏర్పాటు



సఖినేటిపల్లి మండల పరిషత్ కార్యాలయంలో యోగాపై శిక్షణ ఇస్తున్న మన్నె సత్యనారాయణ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో రానున్న అంతర్జాతీయ యోగా డే పురస్కరించుకుని కలెక్టర్ ఆదేశాలపై మూడు రోజులు యోగా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుభవం కలిగిన యోగా నిపుణులతో ఈ నెల 27న, వచ్చే నెల 3, 16 తేదీల్లో వీటిని ఏర్పాటు చేశామన్నారు. యోగా కార్యక్రమాల పట్ల ఆసక్తి ఉన్న వారు విధిగా పాల్గొనాలని ఆయన కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కె.సూర్య నారాయణ ఆధ్వర్యంలో యోగాంధ్రా 2025లో ప్రభుత్వ ఆదేశాలపై యోగా గురువు మన్నె సత్యనారాయణ యోగాపై ఉద్యోగస్తులకు ఒక రోజు శిక్షణ ఇచ్చారు. రానున్న ఇంటర్నేషనల్ యోగా డే పురస్కరించుకుని శిక్షణలో మెళకువలు ఆయన నేర్పారు. ఎంపీడీఓ, ఏఓ నరసింహారావు, పరిషత్ సిబ్బంది, ఇంజినీరింగ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మురుగు కాలువ అభివృద్ధికి దాత సాయం

ఆలమూరు: మండలంలోని జొన్నాడ నుంచి పెనికేరు మీదుగా ప్రవహించే మురుగు కాలువ పూడిక తీత అభివృద్ధి పనులు సోమవారం పూర్తయ్యాయి. ఖరీఫ్ సీజన్‌లో తమ పొలాలు ముంపునకు గురికాకూడదనే ఉద్దేశంతో పెనికేరుకు చెందిన రైతులు మురుగుకాలువ అభివృద్ధి చేయాలని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా దీనిపై స్పందించిన గ్రామానికి చెందిన దాత ఈదల శ్రీరామచంద్రమూర్తి (చినబాబు) స్పందించి రూ.నాలుగు లక్షలు సమకూర్చడంతో రైతులు మురుగు కాలువను రెండు కిలోమీటర్ల మేర యంత్రాల సాయంతో పూడికను తొలగించి వర్షపు ముంపు నీరు బయటకు వెళ్లే విధంగా శుభ్రం చేసుకున్నారు. దాతను పలువురు రైతులు అభినందించారు.

ధాన్యం లోడు ట్రాక్టర్ బోల్తా



సిరిపల్లి శవాల వంతెన వద్ద ధాన్యం లోడుతో బోల్తా కొట్టిన ట్రాక్టర్

అయినవిల్లి: మండలంలోని సిరిపల్లి శవాల వంతెన వద్ద ఎదురుగా వస్తున్న లారీని ధాన్యంలో లోడుతో వస్తున్న ట్రాక్టర్ తప్పించబోయి సమీప పంటకాలువలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, దానిపై కూలీలు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ధాన్యం లోడు మాత్రం పూర్తి తడిచి ముద్దయింది. ఇందులో 30 ధాన్యం బస్తాలు కుట్లు ఊడిపోవడంతో కాలువమట్టిలో కలిసింది. దీనిపై తమకు ఏ విధమైన సమాచారం అందలేదని స్థానిక పోలీసులు తెలిపారు.

సారా విక్రేత అరెస్ట్: మరొకరిపై కేసు



ఆలమూరులో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ కార్యాలయంలో సారాతో పట్టుబడ్డ నిందితులతో పోలీసులు

ఆలమూరు: స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో పరిధిలోని మండపేట మండలంలోని కేశవరంలో అక్రమంగా సారా విక్రయిస్తున్న జి.అప్పలస్వామిని అరెస్ట్ చేశారు. ఎక్సైజ్ సీఐ ఐడీ నాగేశ్వరరావు కథనం ప్రకారం గ్రామ శివారు ప్రాంతంలో సారాను విక్రయిస్తున్నారనే సమాచారంతో ఆలమూరు ఎక్సైజ్ పోలీసుల బృందం దాడులు నిర్వహించింది. ఈ దాడిలో నిందితుడు అప్పలస్వామిని అరెస్ట్ చేసి అతని వద్ద 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. అలాగే సారా సరఫరా చేస్తున్న రాజానగరం మండలం పాత తుంగపాడుకు చెందిన అత్తిలి ప్రసాద్‌పై కేసు నమోదు చేశారు. ఈ మేరకు కేసును దర్యాప్తు చేసి మంగళవారం కోర్టులో హాజరు పర్చనున్నట్లు సీఐ నాగేశ్వరరావు తెలిపారు. మద్యం షాపులు నిబంధనలకు అనుగుణంగా సమయపాలన పాటించకున్నా, అధిక ధరలకు మద్యాన్ని విక్రయించినా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సారాతో పలుమార్లు పట్టుబడిన నిందితులకు పీడీ యాక్టు అమలు చేస్తామన్నారు. ఆలమూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఫిబ్రవరి 1 నుంచి ఏప్రిల్ నెలాఖరు వరకూ 30 కేసులు నమోదు చేసి 19 మంది అరెస్టు చేశామన్నారు, అలాగే వారి వద్ద నుంచి మొత్తం 290 లీటర్ల సారా స్వాధీనం చేసుకోవడంతో పాటు 5700 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఆలమూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఇప్పటివరకూ అధిక కేసులు ఉన్న 54 మంది పాత ముద్దాయిలను తహసీల్దార్ కేజే ప్రకాష్‌బాబు వద్ద హాజరు పర్చి రూ.లక్ష పూచీకత్తుతో బైండోవర్ చేయించామన్నారు. బైండోవర్ చేసిన తర్వాత కూడా మళ్లీ పదే పదే నేరాలకు పాల్పడిన 13 మందికి విధించిన అపరాధ రుసుం ద్వారా ఎక్సైజ్ శాఖకు రూ.3.95 లక్షల ఆదాయం లభించినట్లు సీఐ నాగేశ్వరరావు పేర్కొన్నారు.

డీఆర్పీల శిక్షణను విజయవంతం చేయాలి



బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఈఓ సలీం బాషా

అల్లవరం: విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాల పెంపునకు ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమాన్ని ప్రారంభించిందని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ సలీం బాషా అన్నారు. ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంలో భాగంగా ఓడలరేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాల వేదికగా మంగళవారం నుంచి ప్రారంభమయ్యే డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్ (డీఆర్పీ)ల శిక్షణను విజయవంతం చేయాలని డీఈఓ పిలుపునిచ్చారు. బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించనున్న శిక్షణకు సంబంధించిన ఏర్పాట్లను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈఓ సలీం బాషా మాట్లాడుతూ జిల్లా నుంచి 66 మంది డీఆర్పీలు శిక్షణ పొందనున్నట్లు ఆయన తెలిపారు. పశ్చిమ గోదావరి, ఏలూరు, తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాలకు చెందిన 268 మంది ఇక్కడే శిక్షణ పొందుతారన్నారు. రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ పొందేందుకు అవసరమైన తరగతులు, హాస్టల్ వసతి తదితర సౌకర్యాలను ఆయన పరిశీలించారు. శిక్షణను సమర్థవంతంగా, ఎక్కడా ఎటువంటి లోటు పాట్లకు తావులేకుండా నిర్వహించాలని సమగ్ర శిక్షా అకడమిక్ మానిటరింగ్ అధికారి పి.రాంబాబుకు సూచించారు. తరగతి గదులను, హాస్టల్ రూములను ఆయన పరిశీలించారు. ఏర్పాట్ల పట్ల డీఈఓ సలీం బాషా సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆకుల ప్రవీణ్ పాల్గొన్నారు.

తాగడానికి నీళ్లు లేవంటూ కలెక్టరేట్ వద్ద నిరసన



కలెక్టరేట్ వద్ద బిందెలతో నిరసన తెలుపుతున్న తాటిపాక ఉల్లంపర్తి వారి పేట మహిళలు

అమలాపురం రూరల్: తాగడానికి నీళ్లు లేవంటూ రాజోలు మండలం తాటిపాక గ్రామం ఉల్లంపర్తి వారి పేటకు చెందిన మహిళలు అమలాపురం కలెక్టరేట్ వద్ద బిందెలతో సోమవారం నిరసన తెలిపారు. ఇళ్ల వద్ద ఉన్న బోర్ల నుంచి ఉప్పు నీరు వస్తోందని, ఆ నీటిపై ఆయిల్ పొర కనిపిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. బోరు నీరు తాగడానికి ఉపయోగపడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాగటానికి మంచి నీరు లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇంటింటి కుళాయి పథకంలో అధికారులు ఉల్లంపర్తి వారి పేటను విస్మరించారని వారు విమర్శించారు. ఈ కార్యక్రమంలో కనపాల చంటిబాబు, కనపాల ప్రసాద్‌రావు, చిన్నిబాబు, సరేష్‌బాబు, సుధాకర్ పాల్గొన్నారు.

పేద కుటుంబంపై దాడి

కత్తులతో బెదిరించి తాటాకిల్లు తొలగింపు

కాట్రేనికోన: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం మొల్లేటిమొగ గ్రామంలో నిరుపేద కుటుంబంపై కొత్తపాలెంకు చెందిన అధికార పార్టీకి చెందిన వారు కొందరు సోమవారం దాడి చేసి తాటాకు ఇంటిని పూర్తిగా తొలగించి ఉప్పుటేరులో పడేశారు. పల్లంకుర్రు పంచాయతీ మొల్లేటిమొగకు చెందిన కాలాడి సూరిబాబు కుటుంబం 30 ఏళ్లుగా గ్రామంలోని తాటాకు ఇంటిలో నివాసం ఉంటున్నాడు. ఈయనకు భార్య రామలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. బ్రహ్మ సమేధ్యం పంచాయతీ కొత్తపాలెంకు చెందిన అధికార పార్టీ నాయకుడు కాలాడి అచ్చిబాబు వర్గానికి చెందిన సుమారు 20 మంది మారణాయుధాలతో వచ్చి బెదిరించి దాడి చేసి తాటాకు ఇంటిని తొలగించారని బాధితుడు కాలాడి వీరబాబు తెలిపారు. మొల్లేటి మొగకు చెందిన వ్యక్తి ఇంటిపై దాడిస్తున్న సమయంలో గ్రామ పెద్దలు వెళ్లి సర్దిచెప్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బాధితుడు సూరిబాబు ఆవేదన వ్యక్తం చేసారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేయకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నేడు తాటమ్మ అమ్మవారి తీర్థం



పి.గన్నవరంలో తాటమ్మవారు

పి.గన్నవరం: గ్రామంలో వేంచేసిన తాటమ్మ తల్లి తీర్థ మహోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. తీర్థ మహోత్సవాల్లో భాగంగా ఈనెల 6న అమ్మవారిని నిలబెట్టారు. అప్పటి నుంచి గ్రామస్తులు అమ్మవారికి రోజూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శనివారం పిల్లల సేవ, ఆదివారం చిన్న జాగరం, సోమవారం పెద జాగరాలు కన్నులపండువగా జరిగాయి. సోమవారం రాత్రి అమ్మవారి ఆలయం వద్ద చిన్నారులు, మహిళలు కాగడాలు వెలిగించి, అమ్మవారికి పూజలు చేశారు. మంగళవారం అమ్మవారి తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్నీ సిద్ధం చేసినట్టు ఆలయ ట్రస్టీ సుంకర సత్యసాయిబాబు (రాంబాబు) తెలిపారు.

మహాలక్ష్మమ్మకు నైవేద్యాలు

మామిడికుదురు: పెదపట్నంలంక గ్రామ దేవత మహాలక్ష్మమ్మ జాతరలో భాగంగా సోమవారం భక్తులు అమ్మవారికి నైవేద్యాలు చెల్లించారు. ముడుపులు, మొక్కులు సమర్పించారు. జాతరలో భాగంగా పలు రకాల పుష్పాలతో అమ్మవారి ఆలయాన్ని దేదీప్యమానంగా అలంకరించారు. ఆదివారం రాత్రి జరిగిన జాతరలో పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మ వారికి పూజలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించారు. ఆలయ కమిటీ ఎమ్మెల్యే సత్యనారాయణను ఘనంగా సత్కరించింది. ఎంపీటీసీ కొమ్ముల జంగమయ్య, కూటమి నేతలు ఆయన వెంట ఉన్నారు.

25 ఏళ్లుగా రోడ్డు, డ్రైయినేజీలు లేవు

అంబాజీపేట: మాచవరం శివారు మెట్ల రాంజీ కాలనీ ఏర్పడి 25 ఏళ్లు గడుస్తున్నా నేటికి సరైన రోడ్డు, డ్రైనేజీలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో స్థానికులు సోమవారం వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కొద్దిపాటి వర్షానికే రహదారులు బురదమయంగా మారిపోయి నడిచేందుకు వీలు లేకుండా ఉండటంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. మురుగు నీరు బయటకు వెళ్లేందుకు డ్రైనేజీలు లేక అవస్థలు పడుతున్నామని అధికారులకు వివరించారు. గృహాలు నిర్మించుకుందామన్నా గృహోపకర వస్తువులు తీసుకువచ్చేందుకు రహదారులు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రహదారులు, డ్రైనేజీలు నిర్మించాలని సీహెచ్ కరుణాకర్, సిర్రా హరిబాబు, తొత్తరమూడి రాజుకుమార్, చేట్ల సత్తిబాబు, ఈతకోట సురేష్, గుమ్మడి ఏసు, మంద వాసులు కోరుతున్నారు.

ప్రభుత్వం కక్ష సాధింపు తగదు



ఎండీయూ వాహనాల రద్దును విరమించుకోవాలని ఆందోళన చేస్తున్న ఆపరేటర్లు

ఆలమూరు: మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండీయూ) ఆపరేటర్లను నిరుద్యోగులను చేయొద్దని మండల శాఖ సోమవారం ఆందోళన నిర్వహించింది. మండలంలోని పెదపళ్లలో ఎండీయూ ఆపరేటర్లకు ప్రభుత్వం సత్వర న్యాయం చేయాలంటూ భారీ ర్యాలీ నిర్వహించారు. గత ఐదేళ్లుగా ఎటువంటి అవినీతి ఆరోపణలు లేకుండా ఇంటింటికీ రేషన్ సరకులను పంపిణీ చేసి ప్రజల మన్ననలు అందుకున్న ఎండీయూ వాహనాలపై ప్రభుత్వం కక్ష సాధింపు తగదని హితవు పలికారు. ఎండీయూ వాహనాల రద్దు ప్రకటనపై ప్రభుత్వం పునరాలోచించకపోతే తమ ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.